Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699


# రాజధాని వార్తలు

RAJADHANI VARTALU


ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 6 సంచిక (Issue) : 344 పేజీలు (Pages) : 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

మంగళవారం, 27 - 5 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

## మోదీ రోడ్‌షోలో కల్నల్ సోఫియా ఖురేషి కుటుంబ సభ్యులు



**వడోదర:** ఆపరేషన్ సిందూర్ గురించి ఎప్పటికప్పుడు మీడియాకు సమాచారం అందించిన ఇండియన్ ఆర్మీ కల్నల్ సోఫియా ఖురేషి ఇటీవల అందరి దృష్టిని ఆకర్షించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గుజరాత్‌లోని వడోదరాలో సోమవారంనాడు రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోఫియా కుటుంబ సభ్యులంతా ఇందులో పాల్గొన్నారు. సోఫియా తల్లిదండ్రులు, సోదరుడు మహమ్మద్ సంజయ్ ఖురేషి, సోదరి షైన సున్‌సారలు మోదీకి సాదర స్వాగతం పలికారు. గుజరాత్‌లో రెండ్రోజుల పర్యటన కోసం వచ్చిన ప్రధానికి అభినందించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున రోడ్‌షోలో పాల్గొన్నారు.

**పీఎం మహిళా సాధికారతపై ప్రశంసలు**

సోఫియా ఖురేషి సాధించిన విజయాలు, మహిళా సాధికారతకు కేంద్రం తీసుకుంటున్న చర్యలను ఆమె ట్విన్ సిస్టర్ షానా సున్‌సార ప్రశంసించారు. మహిళా సాధికారతకు మోదీ ఎంతో చేస్తున్నారని అన్నారు. సోఫియా తన ట్విన్ సిస్టర్ అని, దేశానికి తన సోదరి సేవ చేస్తుండటం తనకే కాకుండా, అందరికీ గర్వకారణమవుతుందన్నారు. సోఫియా అందరికీ సోదరేనని అన్నారు. ప్రధాని రోడ్‌షోలో పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారని, మోదీ నాయకత్వంలో ఆపరేషన్ సిందూర్ వంటి అతిపెద్ద సైనిక చర్య నిర్వహించారని అన్నారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన ప్రెస్ బ్రీఫింగ్‌లో తన సోదరి సోఫియా ఖురేషి, మరో వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ పాల్గొన్నట్టు చెప్పారు. తద్వారా మహిళలు ఎవరికీ తక్కువ కాదనే సందేశాన్ని ప్రపంచానికి చాటారని అన్నారు. సోఫియా సోదరుడు సంజయ్ ఖురేషి సైతం ఇదే తరహా అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత ప్రధానమంత్రి ఇక్కడకు రావడం మరిచిపోలేమన్నారు. తన సోదరికి ఇంతటి చక్కటి అవకాశాన్ని ఇచ్చిన భారత ప్రభుత్వానికి, రక్షణ బలగాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాగా, సోఫియా తనకు మాత్రమే కూతురు కాదని, దేశ ప్రజలందరి బిడ్డ అని ఆమె తల్లి హలిమా ఖురేషి అన్నారు. మోదీ ఈ దేశ ప్రధాని అని, అందరితో పాటు తాము కూడా ఆయనకు సాదర స్వాగతం పలికామని చెప్పారు. వడోదరకు చెందిన సోఫియా ఖురేషి 1999లో ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ ద్వారా ఇండియన్ ఆర్మీలోకి అడుగుపెట్టారు. కౌంటర్ ఇన్‌సర్జెన్సీ జోన్లలో పనిచేశారు. 2016లో ఇండియన్ ఆర్మీ ట్రైనింగ్ కంటింజెంట్‌కు నాయకత్వం వహించిన తొలి మహిళా అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారు.


## సీఎం చంద్రబాబు ఆదేశాలతో పొగాకు కొనుగోళ్లలో పెరిగిన వేగం



**అమరావతి, (రాజధాని వార్తలు):** రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా పొగాకు కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు, పొగాకు కంపెనీ ప్రతినిధులను ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో పొగాకు కొనుగోళ్లలో వేగం పెరిగింది. పొగాకు రైతుల సమస్యలపై ఈ నెల(మే) 16వ తేదీన అధికారులు, పలు కంపెనీల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఎం సమీక్ష అనంతరం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. హెచ్డీబర్లే పొగాకు 75 మిలియన్ కేజీల దిగుబడి రాగా.. ఇప్పటికే 21 మిలియన్ కేజీల కొనుగోళ్లు జరిగాయి. ఇంకా రైతుల వద్ద 54 మిలియన్ కిలోల నిల్వలు ఉన్నాయి. ఈ నిల్వల్లో 20 మిలియన్ కేజీలు కొనుగోలు చేస్తామని జీపీఐ, ఐటీసీ ప్రకటించింది. 30 మిలియన్ కేజీల వరకు పొగాకు కొనుగోలు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. రైతుల వద్దనున్న స్టాకు వివరాలను సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులు సర్వే చేసి నమోదు చేయడానికి ప్రత్యేక మొబైల్ యాప్‌ను ప్రభుత్వం రూపొందించింది. పొగాకు అమ్మకాలను సమీక్షించేందుకు కంట్రోల్ రూమ్ నెంబర్‌ను 0863-2358531 ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కొనుగోలుపై అన్ని పొగాకు కంపెనీలకు ముఖ్యమంత్రి లక్ష్యాన్ని నిర్దేశించారు. కొనుగోళ్లపై ప్రతి రెండు రోజులకు ఒకసారి తనకు నివేదించాలని అధికారులకు ఆదేశించారు. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలోకి వెళ్లి కొనుగోళ్లను అధికారులు పర్యవేక్షిస్తున్నారు. క్వింటాల్‌కు రూ.12 వేల ధర తగ్గకుండా వారం రోజుల్లో కొనుగోళ్లు పూర్తి చేయాలని అన్నారు. సీఎం ఆదేశాలు అమలయ్యేలా చూసేందుకు కొనుగోళ్లపై 14 పొగాకు కంపెనీల ప్రతినిధులతో ఇవాళ(సోమవారం) వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శి సమావేశం నిర్వహించారు.

## కోనసీమ జిల్లాలో విషాదం.. స్నానానికి వెళ్లిన ఎనిమిది

**కోనసీమ, (రాజధాని వార్తలు):** కోనసీమ జిల్లాలోని ముమ్మిడివరం మండలంలో తీవ్ర విషాదం నెలకొంది. శుభకార్యానికి వచ్చిన యువకులు గోదావరిలో ఇవాళ(సోమవారం) స్నానం చేయడానికి వెళ్లారు. స్నానం చేసే సమయంలో నీటి ఉధృతి ఒక్కసారిగా పెరగడంతో ఎనిమిది మంది యువకులు గల్లంతయ్యారు. ఈ ఘటన ముమ్మిడివరం మండలం కమిని లంక సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కె.గంగవరం మండలం శేరులంక గ్రామంలో ఓ శుభకార్యానికి కాకినాడ, రామచంద్రపురం, మండపేట గ్రామాల నుంచి పలు కుటుంబాల వారు వచ్చారు. సమీపంలోని గోదావరిలో స్నానానికి 11మంది యువకులు వెళ్లారు. వీరిలో ఎనిమిది మంది గల్లంతయ్యారు. వీరిలో కాకినాడకు చెందిన నలుగురు క్రాంతి(20), పాల్ (18), సాయి (18), సతీష్ (19) ఐ.పోలవరం మండలం ఎర్రగరువు గ్రామానికి చెందిన మహేష్, రాజేష్ (13), మండపేటకు చెందిన రోహిత్, శేరులంకకు చెందిన మహేష్‌లు గోదావరిలో గల్లంతయ్యారు. ఈ విషయం తెలియడంతో యువకుల కుటుంబ సభ్యులు



తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆయా కుటుంబాలు తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయాయి. పోలీసులకు కుటుంబ సభ్యులు సమాచారం అందజేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. గజ ఈతగాళ్లు గోదావరిలో దిగి యువకుల కోసం వెతుకుతున్నారు. వారి ఆచూకీ ఇంకా తెలియకపోవడంతో టెన్షన్ పడుతున్నారు.

## నైరుతీ రుతు పవనాల ప్రభావం.. దేశవ్యాప్తంగా జోరుగా వర్షాలు

**ఇంటర్నెట్‌డెస్క్:** దేశ వ్యాప్తంగా జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. 16ఏళ్ల తర్వాత ముందే దేశంలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు బలంగా ఉండటంతో దాదాపు దేశమంతా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈదురుగాలులతో కూడిన వర్షాల కారణంగా అనేక రాష్ట్రాల్లో బీభత్సకర పరిస్థితులు ఏర్పడ్డాయి. కేరళ వర్షాలకు తడిసిముద్దైంది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేరళలోని 11 జిల్లాలకు ఐఎండీ రెడ్ అలర్ట్ జారీ చేసింది. అటు, తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. తమిళనాడు ఊటీలో చెట్టుపడి బాలుడి మృతి చెందగా, కర్ణాటకలో బెళగావి జిల్లాలో గోడకూలి నిద్రలోనే మూడేళ్ల బాలిక ప్రాణాలొదిలింది. మహారాష్ట్రలో కూడా వర్షాలు దంచికొడుతున్నాయి. ముంబయిలో ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. పలు ప్రాంతాల్లో సబర్బన్ రైలు సర్వీసులు నిలిచిపోయాయి. విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దాదార్, మహిమ్, పరెల్, బాంద్రా, కాలాచౌకీతో పాటు మరిన్ని ప్రాంతాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.




## ఆపరేషన్ సిందూర్‌పై ముందుగానే పాక్‌కు లీక్.. పెదవి విప్పిన జైశంకర్



**న్యూఢిల్లీ:** ఆపరేషన్ సిందూర్ గురించి పాకిస్థాన్‌కు ముందుగానే సమాచారం ఇవ్వడంతో భారత్ పంపిన రాఫెల్ జెట్ల సహా పలు యుద్ధవిమానాలను కూల్చేశారని, వాటి వివరాలు బయటపెట్టాలని కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలపై కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ ఎట్టకేలకు స్పందించారు. సైనిక దాడులపై మ్మందే తాను సమాచారం ఇచ్చినట్టు కాంగ్రెస్ పార్టీ చేసిన ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. ఇవి నిజాయితీ లోపించిన ఆరోపణలని, వాస్తవాలను వక్రీకరించారని అన్నారు. సోమవారంనాడిక్కడ జరిగిన పార్లమెంటరీ కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో ఎంపీలు లేవనెత్తిన పలు ప్రశ్నలకు జైశంకర్ స్పష్టత ఇచ్చారు. భారతదేశం చేపట్టిన మిలటరీ యాక్షన్ విజయవంతంగా ఉగ్రస్థావరాలను మట్టుబెట్టి పాకిస్థాన్ నైతిక స్థైర్యాన్ని దెబ్బకొట్టిందని జైశంకర్ అన్నారు. సైనిక ఆపరేషన్ పూర్తయిన తర్వాత మాత్రమే ఆ సమాచారాన్ని పాకిస్థాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ)కు భారత డీజీఎంఓ తెలియజేసిందని, విపక్షాలు చెబుతున్నట్టు ఆపరేషన్ ప్రారంభం కావడానికి ముందుమాత్రం కాదని స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ గురించి ముందుగానే పాకిస్థాన్‌కు సమాచారం ఇచ్చినట్టు జైశంకర్ బహిరంగంగానే అంగీకరించారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇటీవల వరుస ఆరోపణలు గుప్పించారు. ఇంతటి సున్నితమైన సమాచారాన్ని పంచుకోవడం వల్ల ఇండియాకు చెందిన ఎన్ని విమానాలను కోల్పోయామో చెప్పాలని డిమాండ్ చేశారు. జైశంకర్ మాట్లాడుతున్న ఒక వీడియోను కూడా రాహుల్ షేర్ చేశారు. అయితే, ఈ ఆరోపణలను విదేశాంగ శాఖ ఖండించింది. జైశంకర్ చేసిన వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారని, ఆపరేషన్‌కు ముందే పాక్‌కు సమాచారం ఇచ్చినట్టు జైశంకర్ ఎప్పుడూ చెప్పలేదని పేర్కొంది.

**యూఎస్ మధ్యవర్తిత్వంపై..**

కాగా, ఈ ఆపరేషన్‌లో అమెరికా ప్రమేయం, అమెరికా మధ్యవర్తిత్వంపై ఎంపీలు జైశంకర్‌ను ప్రశ్నించగా, ఆపరేషన్ సులభతరం చేయడంలో అమెరికా పాత్ర ఏమీ లేదని ఆయన స్పష్టం చేశారు. యూఎస్‌తో మాట్లాడినప్పుడు డీజీఎంఓ స్థాయిలో మాత్రమే చర్చలు జరగాలని భారత్ చాలా స్పష్టంగా చెప్పిందని తెలిపారు.

**సింధు జలాల ఒప్పందంపై..**

సింధు జలాల ఒప్పందంపై కూడా కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. ఒప్పందాన్ని పునఃప్రారంభించే ఆలోచన కానీ, సవరించే ఆలోచన కానీ ఇండియాకు ఉందా అని అడిగినప్పుడు, ప్రస్తుతం ఈ ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేయడం జరిగిందని, ఇప్పటికిప్పుడు కేంద్రానికి దీనిపై ఎలాంటి పునరాలోచన లేదని చెప్పారు.

## తెలంగాణలో ఉప ఎన్నికలు ఖాయం : కేటీఆర్



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** తెలంగాణలో ఉప ఎన్నికలు వస్తే గద్వాల్‌లో మళ్లీ గులాబీ జెండా ఎగరవేస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ధీమా వ్యక్తం చేశారు. 200 జెట్‌స్పీడ్‌తో తాము గెలవడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. రుణమాఫీ పూర్తిగా అమలు చేయకుండా రేవంత్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుందని విమర్శలు చేశారు కేటీఆర్. ఈ శతాబ్దపు అతి పెద్ద మోసం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అభయ హస్తమని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. ఇవాళ(సోమవారం) తెలంగాణ భవన్‌లో మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన తర్వాత పదేళ్ల తమ హయాంలో రాష్ట్రానికి బలమైన పునాది వేశామని ఉద్ఘాటించారు. దిక్కుమాలిన కాంగ్రెస్ పార్టీని పాలమూరు ప్రజలు నమ్మి బొక్కబోర్ల పడ్డారని చెప్పారు. ఇంకా ఎన్ని రోజులు చూడాలి కాంగ్రెస్ దరిద్రాన్ని అని రాష్ట్ర ప్రజలు బాధపడుతున్నారని మాజీ మంత్రి కేటీఆర్ చెప్పుకొచ్చారు. పదిమంది నేతలు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లారని.. వారికి కర్రు కాల్చివాత పెట్టాలని హెచ్చరించారు మాజీ మంత్రి కేటీఆర్. మనతోనే ఉండి మనకే వెన్నుపోటు పొడిచి వెళ్లిపోయారని మండిపడ్డారు. పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేలకు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. నాడు నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఉద్యమం చేశామని గుర్తుచేశారు. నేడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నిందలు, దందాలు, చందాలు చేస్తున్నారని ఆరోపించారు. రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి చాలాసార్లు మాట మార్చారని మండిపడ్డారు. అపరిచితుడు చిత్రంలోని రాము, రెమోలాగా రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని విమర్శించారు. జూన్ మాసంలో బీఆర్ఎస్ మెంబర్ షిప్ ప్రారంభిస్తామని ప్రకటించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు కొత్త కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నిక ఏదైనా కాంగ్రెస్, బీజేపీకి గట్టిగా బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉండాలని బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు.

# తొలి తిరుపతికి భక్తుల తాకిడి... ఒక్కరోజు ఆదాయం రూ. 2.71 లక్షలు





**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** తొలి తిరుపతిగా ప్రసిద్ధి చెందిన శ్రీ శృంగారవల్లభ స్వామి దేవస్థానమునకు శనివారం భక్తుల తాకిడి కలిగింది. శనివారం ఒక్కరోజు స్వామివారికి రూ. 2,71,180 ఆధాయం లభించింది. సుమారు 12 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయమే స్వామివారిని పుష్పాలతో అలంకరించి భక్తుల దర్శనానికి అనుమతించారు. కాగా ఆలయానికి ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ. 1,58,500, అన్నదాన విరాళములు ద్వారా రూ 80,130, కేశ ఖండన ద్వారా రూ. 6,200, తులాభారం ద్వారా రూ. 250, లడ్డు ప్రసాదం ద్వారా 26,100 వెరశి రూ.2,71,180 ఆదాయం వచ్చినట్టు ఆలయ కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. కాగా దేవస్థానం తరుపున భక్తులకు ఉదయం పులిహోర ప్రసాదం, ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే సుమారు 3 వేల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమా చార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, గ్రామ నాయకులు సహకారం అందించినట్టు ఆలయ అధికారి శ్రీనివాసరావు తెలిపారు.

# వైఎస్ఆర్సిపి జిల్లా ముఖ్య నేతల సమన్వయ సమావేశం

**అమలాపురం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల సమన్వయ సమావేశం నిర్వహించారు. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ఆహ్వానంపై ఆయన నివాసంలో జిల్లా,నియోజకవర్గ కో-ఆర్డినేటర్లు, ముఖ్య నాయకులు శనివారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పార్టీ సమన్వయం, తదితర అంశాలపై విశ్లేషణాత్మకంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్య నారాయణరావు, తోట త్రిమూర్తులు, బొమ్మి ఇజ్రాయిల్,అమలాపురం పార్లమెంట్ కో-ఆర్డి నేటర్ పినిపే విశ్వరూప్, పార్లమెంట్ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, రాజోలు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గొల్లపల్లి సూర్యా రావు, అమలాపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్, రామచంద్రపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్,



పి.గన్నవరం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస రావు, ముమ్మిడివరం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పొన్నాడ సతీష్, జెడ్పి చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, పి.గన్నవరం మాజీ శాసన సభ్యురాలు పాముల రాజేశ్వరి దేవి తదితరులు పాల్గొన్నారు.

# అన్నదానం ప్రధానం : డిసిసిబి చైర్మన్



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** దానాల్లోకెల్ల అన్నదానం ప్రధానమైనదని డిసి సిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. పెద్దాపురం మండలం పులిమేరు గ్రామంలోని శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ (డీసీసీబీ) చైర్మన్, కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు తుమ్మల రామస్వామి (బాబు) పాల్గొని ప్రారంభించారు. హనుమద్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అన్న దానంలో వేలాదిగా ప్రజలు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# కడపలో నిర్వహించనున్న మహానాడు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించిన మంత్రులు

## - మంత్రి నారాయణ వారి నివాసంలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి భేటీ



**నెల్లూరు/కోవూరు, (రాజధాని వార్తలు):** టీడీపీ అధిష్టానం మేరకు ఈ నెల 27 నుంచి కడపలో నిర్వహించనున్న మహానాడుకు భారీ స్థాయిలో నేతలు, కార్యకర్తలు హాజరు కానున్నారు. జిల్లా నుంచి సుమారు 50 వేల మంది కార్యకర్తలు మహానాడుకు తరలి వస్తారని అంచనా వేశారు. అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని మంత్రులు సూచించారు. రవాణా సౌకర్యాలపై సమీక్ష నిర్వహించి, అవసరమైతే ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలను కూడా వినియోగించాలనే నిర్ణయం తీసుకున్నారు.మహానాడులో పాల్గొనే వారెవరికీ ఇబ్బందులు తలెత్తకుండా సజావుగా నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఈ సమీక్ష సమావేశంలో తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ పైప్ లైన్‌తో గృహిణులకు భద్రత




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** గృహిణిలకు భద్రత పరమైన గ్యాస్ పైప్ లైన్ ఇవ్వడం చాలా సంతోషకరమైన విషయం అని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్పలు అన్నారు. పెద్దాపురం పట్టణంలో భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డొమెస్టిక్ అండర్ పైప్ లైన్ కనెక్షన్, వాల్ చాంబర్‌ను స్థానిక ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పతో కలిసి డిసిసిబి చైర్మన్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అండర్ పైప్ లైన్ గ్యాస్ వల్ల గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు తక్కువ ఉంటుందన్నారు. ప్రతి ఇంటికి గ్యాస్ వెళ్లే ఏర్పాటు చెయ్యడం మంచి విషయం అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు, గృహిణిలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజక వర్గ కన్వీనర్ విత్తనాల వెంకట రమణ, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, పెద్దాపురం 20వ వార్డు కౌన్సిలర్ ఒబిలిశెట్టి వనిత గణేష్, టౌన్ ప్రెసిడెంట్ పొలమరశెట్టి సత్తిబాబు, కటారి శ్రీను, తమనరా లక్ష్మణ్ దివాకర్, పన్నీరు శివ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# జిల్లాలో కోవిడ్ కేసు నమోదు

## - ఎవరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదు : జిల్లా వైద్యాధికారి

**అమలాపురం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో శనివారం కోవిడ్ కేసు నమోదు అయింది. దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమయింది. వివరాలలోనికి వెళ్ళగా కే గంగవరం మండలం సత్యవాడ గ్రామంలో సలాది వెంకటరావు (64) జ్వరం, జలుబు, దగ్గు శ్వాస తీసుకోవడం ఇబ్బందులు వంటి లక్షణాలు కనిపించడంతో ద్రాక్షారంలోని అమృత రక్షిత హాస్పిటల్‌కు వెళ్ళగా కోవిడ్ పరీక్ష చేయించారు. అతనికి పాజిటివ్ రిపోర్ట్ రావడంతో నిర్ధారణ కొరకు పామర్రు పీహెచ్సీ వైద్యులు జిజిహెచ్ కాకినాడ తరలించి ఆర్ టి ఆర్ సి పి పరీక్ష చేయించగా కోవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయినట్లు ధ్రువీకరించారు. గ్రామంలో కోవిడ్ కేసు నమోదు కావడంతో ఆదివారం సత్యవాడలో వైద్య సిబ్బంది క్యాంప్ నిర్వహించనున్నారు.

గ్రామస్తులు ఎటువంటి ఆందోళన చందనవసరం లేదని, ఎవరైనా దగ్గు,జలుబు, జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఉంటే ఆరోగ్య సిబ్బందికి వివరాలు ఇచ్చి అవసరమైన చికిత్స తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం దుర్గారావు కోరారు. కరోనాకు ఎవరూ ఆందోళన చెందవద్దని మాస్కు ధరించాలని, జన సమూహంగా ఉండరాదని, వ్యక్తిగత జాగ్రత్తలు పరిశుభ్రత పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సూచించారు.

# పంట కాలువలోకి దూసుకుపోయిన టిప్పర్



**అమలాపురం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం మొండెపులంక వద్ద టిప్పర్ లారీ అదుపుతప్పి పంట కాలువలోనికి దూసుకు పోయింది. కంకర్ లోడుతో రాజోలు వైపు వెళుతుండగా డ్రైవర్‌కు రెప్ప పడటంతో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చిన్న పంట కాలువలోకి దూసుకు పోయింది.

తెల్లవారుజాము కావడంతో డ్రైవర్‌కు రెప్ప పడటంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికుల సమాచారం. రోడ్డు పక్కన ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ క్షేమంగా తప్పించుకున్నారు.

# రెవిన్యూ హేతుబద్ధీకరణను స్వాగతిస్తున్నాం

## - వీఆర్వోల జిల్లా అధ్యక్షులు ఎండి ఖాదర్ వల్లి

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ప్రభుత్వం సచివాలయం ఉద్యోగుల హేతుబద్ధీ కరణ రెవిన్యూ శాఖల ప్రక్షాళనలో భాగంగా జీవో నెం 4 ద్వారా వీఆర్వోలకు లబ్ధి చేకూరుతుందని వీఆర్వోల సంఘం కాకినాడ జిల్లా అధ్యక్షులు ఎండి ఖాదరవల్లి అన్నారు. శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలుపుతూ జీవో నెంబర్ 4 ద్వారా విఆర్వోలకు లబ్ధి చేకూరుతుందని ఆశిస్తున్నా మన్నారు. గత ప్రభుత్వ హయాంలో సచివాల యానికి ఒక విఆర్వో విధులు నిర్వహించేవారని, దీంతో సామర్లకోట మండల పరిధిలో 36 సచివాలయాలకు గాను 36 మంది వీఆర్వోలు విధులు నిర్వహించేవారన్నారు. కూటమి ప్రభుత్వం రెండు సచివాలయాలను ఒక క్లస్టర్ గా తీసుకు రావడంతో 17 సచివాలయాలకు వీఆర్వోలను రిలీవ్ చేయడం జరిగిందన్నారు. మండలంలో విలేజ్ సర్వేయర్లు 21 మంది ఉండగా 11 మందికి రిలీవ్‌కు ఆర్డర్ రావడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వీఆర్వోలు స్వాగతిస్తున్నారన్నారు. దీని ద్వారా అర్హులైన వీఆర్వోలు వివిధ విభాగాలలో విధులు నిర్వహించడం ద్వారా ముందుకు సాగవచ్చని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అయితే ఈ జీవో కు సంబంధించి ఇప్పటివరకు పూర్తి విధి విధానాలు జారీ చేయబడ లేదని, రెండు రోజుల్లో వీటిపై స్పష్టత రానన్నట్లు ఖాధర్ వల్లీ తెలిపారు.



# చోరీ కేసులో మహిళ అరెస్ట్... రూ. 6 లక్షల సొత్తు రికవరీ

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట అంబటివారి తోటలోని సింగవరపు సత్యనారాయణ గృహంలో జరిగిన చోరీలో నిందితురాలైన సామర్లకోట బల్ల మార్కెట్ సెంటర్ కు చెందిన బొడ్డు దుర్గాదేవి (35) ను సామర్లకోట పోలీసులు శనివారం అరెస్టు చేసి కోర్టుకు అప్ప గించారు. బాధితులు సింగవరపు సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పెద్దాపురం డిఎస్పి డి శ్రీహరి రాజు పర్యవేక్షణలో సామర్లకోట సిఐ ఏ కృష్ణ భగవాన్, క్రైమ్ ఎస్సై అంక బాబులు సిబ్బంది సహకారంతో దొంగతనానికి పాల్పడిన బొడ్డు దుర్గాదేవి అని మహిళలు అరెస్ట్ చేశారు. కాగా ఆమెనుండి ఆరు లక్షలు విలువచేసే బంగారము, చిన్న వజ్రాలు, ఒక స్మార్ట్ వాచ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా నిందితురాలిని కాకినాడ కోర్టుకు అప్పగించినట్టు సిఐ కృష్ణ భగవాన్ చెప్పారు. ఎవరైనా ఇంటికి తాళాలు వేసి వాళ్లకు వెళితే ఎల్‌హెచ్ఎంఎస్‌ను ఉపయోగించాలని, ఇంట్లో పని కోసం ఎవరైనా మహిళలను పనికి పెట్టుకున్న దలచిన వారు వారి పూర్తి వివరాలను తెలుసుకొని దగ్గర ఉంచుకో వాలని సీఐ చెప్పారు. కాగా చోరీ కేసులో రికవరీ చేసిన సిఐలను, సిబ్బందిని డీఎస్పీ శ్రీహరి రాజు అభినందించారు.




# పితృవియోగంతో బాధ పడుతున్న విలేఖరి మురళిని పరామర్శించిన ఎమ్మెల్సీ

**అల్లవరం, (రాజధాని వార్తలు):** ఇటీవల పితృవియోగంతో బాధ పడుతున్న అల్లవరం మండలం దేవగుప్తం గ్రామానికి చెందిన ప్రముఖ సాక్షి విలేఖరి కట్టా మురళి కుటుంబాన్ని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. మురళి తండ్రి కట్టా నాగభూషణం (91) ఇటీవల మృతి చెందగా శనివారం ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌తో పాటు మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్, కుంచే రమణా రావు, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షులు కొనుకు బాపూజీ, సాధనాల శ్రీనివాస్, అగ్రికల్చర్ ఏవో సత్యనారాయణ, మండల పశు వైద్యాధికారి నారాయణరావు, ఎంఈఓ కిరణ్ బాబు, ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు పలువురు మురళి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



# మమితా–కయాదు మధ్యలో కేతిక తన్నుకుపోయిందా?



ఒక హీరోయిన్ అవకాశం మరో హీరోయిన్ తన్నుకు పోవడం సహజమే. కొన్నిసార్లు హీరోయిన్ల అలసత్వం కారణమైతే మరికొన్ని సార్లు మేకర్ల నిర్ణయాల కారణంగా రాత్రికి రాత్రే హీరోయిన్లు మారిపోతుంటారు. తాజాగా రవితేజ కొత్త చిత్రం విషయంలో అదే జరిగినట్లు కనిపిస్తుంది. రవితేజ్ హీరోగా కిషోర్ తిరుమల ఓ సినిమాకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే స్టోరీ లాక్ అయింది. ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఇందులో ఇద్దరు నాయికలకు అవకాశం ఉండగా? వాటి కోసం కయదా లోహార్, మమితా బైజులను పరిశీలిస్తున్నారు. వాళ్లతో టీమ్ డిస్కషన్స్ కూడా షురూ చేసింది. వాళ్లిద్దరిలో ఒకరు మెయిన్ లీడ్ కి..మరొకరు సెకెండ్ లీడ్ కి ఎంపిక అవ్వాల్సి ఉంది. అయితే ఇప్పుడా ఇద్దరి మధ్యలో మెయిన్ లీడ్ ఛాన్స్ కేతిక శర్మ తన్నుకుపోయింది. మేకర్స్ అమెను ఫైనల్ చేసినట్లు సన్నిహితుల నుంచి తెలిసింది. కేతికతో అన్ని రకాల అగ్రిమెంట్లు చేసుకున్నట్లు సమాచారం. జులై నుంచి రెగ్యులర్ షూటింగ్ కూడా మొదలవుతుందని తెలిసింది. వాస్తవానికి కేతిక పేరు ఈ ప్రాజెక్ట్ ప్రచారంలోనే లేదు. తొలి నుంచి కయాదు లోహర్, మమితా బైజు పేర్లే బలంగా వినిపించాయి. కానీ ఈ సన్నివేశం రాత్రికి రాత్రే మారిపోయింది. కేతిక పేరు పరిశీలనలోకి రాగానే అమ్మడు చక్రం తిప్ప ప్రాజెక్ట్ చేజిక్కుచుకుంది. దీనికి సంబంధించి మేకర్స్ నుంచి అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది. ఇటీవలే కేతిక శర్మ 'సింగిల్' సినిమాతో మంచి విజయం అందుకుంది. 'రొమాంటిక్' సినిమాతో కేతిక టాలీవుడ్ కి ఎంట్రీ ఇచ్చింది. అటుపై కొన్ని సినిమాలు చేసినా కలిసి రాలేదు.'సింగిల్' తో మళ్లీ బౌన్స్ బ్యాక్ అయింది. ఆ క్రేజ్ తోనే ఛాన్స్ అందుకుంది.

# ఎయిర్‌పోర్ట్‌లో అక్కినేని జంట



సెలబ్రిటీల ఎయిర్ పోర్ట్ వీడియోలు, ఫోటోలు రెగ్యులర్‌గా వైరల్ అవుతూ ఉన్నాయి. ఒకప్పుడు బాలీవుడ్ తారల ఎయిర్ పోర్ట్ వీడియోలు, ఫోటోలు మాత్రమే సోషల్ మీడియాలో ఎక్కువగా సందడి చేస్తూ ఉండేవి. కానీ ఇప్పుడు సౌత్ స్టార్స్ ఎయిర్ జర్నీ ఫోటోలు సైతం తెగ వైరల్ అవుతున్నాయి. తాజాగా అక్కినేని జంట నాగ చైతన్య, శోభితల వీడియో వైరల్ అయింది. హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లో వీరిద్దరు కనిపించారు. హైదరాబాద్ నుంచి బయలుదేరుతున్న ఈ వీడియోలో అక్కినేని జంటను చూసి చాలా మంది ఫ్యాన్స్‌తో పాటు, సోషల్ మీడియా జనాలు తెగ లైక్ చేస్తున్నారు. చాలా సింపుల్‌గా ఉన్న వీరిద్దరి గురించి ప్రముఖంగా చర్చ జరుగుతోంది. సినిమాల షూటింగ్‌తో ఎప్పుడూ బిజీగా ఉండే నాగ చైతన్య, శోభిత తాజాగా కాస్త బ్రేక్ తీసుకుని విహార యాత్రకు వెళ్లినట్లుగా తెలుస్తోంది. ఎయిర్ పోర్ట్‌లో ఎప్పటిలాగే నాగ చైతన్య సింపుల్ అండ్ హ్యాడ్సమ్ లుక్‌లో కనిపించాడు. వైట్ టీ షర్ట్ ధరించి, బ్లాక్ పాయింట్ ధరించడం ద్వారా కూల్‌గా కనిపిస్తున్నాడు. ఇక శోభిత స్టైలిష్ లుక్‌లో కనిపించింది. స్టైలిష్ గాగుల్స్ ధరించడం ద్వారా అందరి చూపు తన వైపుకు తిప్పుకుంది. అంతే కాకుండా ఆమె ఔట్ ఫిట్ కూడా చాలా ట్రెండీగా ఉంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. బ్లూ జీన్స్‌లో ఆమె నడుస్తూ ఉంటే స్టైల్ ఐకాన్ నడిచినట్లు అనిపిస్తుంది అంటూ సోషల్ మీడియాలో చాలా మంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నాగ చైతన్య, శోభిత పెళ్లి తర్వాత చాలా సార్లు ఇలా ఎయిర్ పోర్ట్‌లో, పబ్లిక్ ఈవెంట్స్‌లో కలిసి కనిపించారు. అయినా కూడా ఇదే మొదటి సారి అన్నట్లుగా మీడియా వారు వీరిని ఫోటోలు తీసేందుకు గాను తెగ ఎగబడ్డారు. ఇద్దరు అలా ఎయిర్ పోర్ట్‌లో కలిసి లోనికి వెళ్లే వరకు అభిమానులు, మీడియా వారు వారిని వెంబడిస్తూనే ఉన్నారు. వీరికి ఉన్న క్రేజ్‌కి ఇదే సాక్ష్యం. సోషల్ మీడియాలో శోభిత ఫోటోలు ఎప్పటికప్పుడు వైరల్ అవుతూనే ఉంటాయి. నాగ చైతన్య కాస్త సోషల్ మీడియాకు దూరంగా ఉంటాడు. అయితే శోభిత మాత్రం రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలు, వీడియోలను షేర్ చేయడం ద్వారా అభిమానులకు చేరువగా ఉంటాడు. ఇటీవల తండేల్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చి భారీ విజయాన్ని సొంతం చేసుకున్న నాగ చైతన్య మరో బ్లాక్ బస్టర్ విజయం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. విభిన్న చిత్రాల దర్శకుడిగా పేరు సొంతం చేసుకున్న కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో చైతూ సినిమాను చేస్తున్నాడు. ఆ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. మరో వంద కోట్ల సినిమాను తన ఖాతాలో వేసుకునేందుకు గాను నాగ చైతన్య తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నాడు. అందుకోసం కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో చేసే సినిమా కథ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నాడు. అందుకే కచ్చితంగా సినిమా వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు వచ్చి భారీ విజయాన్ని సొంతం చేసుకునే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

# తమిళ హీరోకు తల నొప్పి తెచ్చి పెట్టిన మంచు మనోజ్



మంచు హీరో మనోజ్ దాదాపు దశాబ్ద కాలం తర్వాత ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటించిన భైరవం సినిమాలో మంచు మనోజ్ ముఖ్య పాత్రలో నటించాడు. నారా రోహిత్ సైతం ఈ సినిమాలో కీలక పాత్రలో నటించిన విషయం తెల్సిందే. సినిమాను మే 30న ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా ముగ్గురు హీరోలు తెగ సందడి చేస్తున్నారు. ముఖ్యంగా సుదీర్ఘ కాలం బ్రేక్ తర్వాత మంచు మనోజ్ నుంచి రాబోతున్న సినిమా కావడంతో అందరి దృష్టి ఆయనపై ఉంది. అందుకే ప్రమోషన్ సమయంలో ఆయనే ఎక్కువగా యాక్టివ్‌గా ఉంటే సినిమాకు బజ్ క్రియేట్ అవుతుందని భావిస్తున్నారు. సినిమాలో మంచు మనోజ్ పాత్ర ఏ మేరకు ఉంటుంది అన ఏ విషయంలో క్లారిటీ లేదు... కానీ ఆయన ప్రమోషన్‌లో బెల్లంకొండను డామినేట్ చేసి మరీ కనిపిస్తున్నారు అంటూ టాక్ వినిపిస్తుంది. ఏ పబ్లిసిటీ కార్యక్రమంలో అయినా మంచు మనోజ్ సందడి ఎక్కువగా ఉంటుంది. ముగ్గురు హీరోలు ఉన్నా అందులో మంచు మనోజ్ గోల కనిపిస్తూ ఉంది. తాజాగా భైరవం సినిమా యొక్క ప్రీ రిలీజ్ ఈవెంట్ వైభవంగా జరిగింది. ఆ ఈవెంట్‌లోనూ మంచు మనోజ్ మాట్లాడిన మాటలు అందరి దృష్టిని ఆకర్షించాయి. అంతే కాకుండా మనోజ్ సరదాగా తమిళ హీరో శింబుకు కాల్ చేసిన మాటలు, వీడియోలు కూడా వైరల్ అయ్యాయి. ఆ సమయంలో శింబు ఫోన్ నెంబర్‌ను మంచు మనోజ్ లీక్ చేశాడు. మొదట మనోజ్ తన ఫోన్ నుంచి శింబు కు కాల్ చేశాడు. శబ్దం సరిగా వినిపించక పోవడంతో పక్కనే ఉన్న హీరోయిన్ ఫోన్ తీసుకుని శింబు ఫోన్‌కి కాల్ చేశాడు. అప్పుడు ఫోన్‌ను కెమెరా వైపు తిప్పి ఉంచి మాట్లాడటంతో లైవ్‌లో నెంబర్ టెలికాస్ట్ అయింది. ఇప్పటికీ యూట్యూబ్‌లో ఆ ఫోన్ నెంబర్ కనిపిస్తుంది. దాంతో నిమిషాల వ్యవధిలోనే శింబుకు ఫోన్ల మీద ఫోన్‌లు వచ్చాయట. మనోజ్ చేసిన పనితో శింబుకు వరుస కాల్స్ వచ్చి తలనొప్పి మొదలైందట. దాంతో శింబు కొంత సమయం ఫోన్ ఆఫ్ చేశారని కూడా తెలుస్తోంది. అదే సమయంలో నీ నెంబర్ లీక్ అయింది, నీ కోసం నేను కొత్త సిమ్ కార్డ్‌ను కొని పంపిస్తాను అని మనోజ్ సరదాగా అన్నాడు. కమల్ హాసన్ సర్ సినిమా థగ్ లైఫ్‌లో ఆయనతో కలిసి నటించే అవకాశం దక్కించుకున్న శింబుకు మనోజ్ శుభాకాంక్షలు తెలియజేశాడు. కమల్ సర్‌తో కలిసి నటించే అవకాశం దక్కించుకోవడం చూస్తే జెలస్‌గా అనిపిస్తుందని లైవ్‌లోనే థగ్ లైఫ్ సినిమాకు ఆల్ ది బెస్ట్ చెప్పి తన మంచి తనంను మంచు మనోజ్ చూపించాడు. మొత్తానికి భైరవం సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో జరిగిన ఈ సంఘటనతో శింబు ఫోన్ ఒక్కసారిగా బిజీ అయింది. శింబుకు తలనొప్పి కల్పించిన మంచు మనోజ్ నిజంగానే ఆయనకు కొత్త నెంబర్ ఇస్తాడా అనేది చూడాలి. శింబు నెంబర్ ఇప్పటికే సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఆ ఫోన్ నెంబర్‌కి వేలాది మంది కాల్స్ చేస్తున్నారు. తమిళం వారికి కూడా శింబు నెంబర్ చేరడంతో మరింతగా ఆయనకు కాల్స్ ఎక్కువ అయ్యి ఉంటాయి.

# దిల్ రాజు, సురేష్ బాబు.. ఇప్పటికే లేటైంది సారూ



'తెలుగు సినిమా ఇండస్ట్రీ అంతా ఆ నలుగురు చేతిల్లోనే ఉంది'.. కొద్ది రోజులుగా ఈ విషయం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఓ రేంజ్‌లో చర్చ జరుగుతోంది. అనేక మంది నెటిజన్లు తమ తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఆ నలుగురు వల్ల టాలీవుడ్‌లో ఇటీవల పరిణామాలు నెలకొన్నాయని కొందరు అభిప్రాయపడుతున్నారు. రీసెంట్‌గా ఎగ్జిబిటర్స్.. థియేటర్స్‌ను క్లోజ్ చేస్తామని ప్రకటించారు. పర్సంటేజ్ విధానంలో మూవీలు రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కానీ అలా చేస్తే తమకు నష్టం వస్తుందని నిర్మాతలు వెనకడుగు వేస్తున్నారు. ఇంతలోనే ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్.. సినిమా సంఘాల ప్రతినిధులకు కృతజ్ఞత లేదని తీవ్రంగా మండిపడ్డారు. ప్రభుత్వం ఏర్పాటైన ఏడాది అవుతున్నా.. సీఎంను కలిశారా అని ప్రశ్నించారు. ఆ సమయంలో ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి.. పవన్ హరిహర వీరమల్లు రిలీజ్ కు ముందే థియేటర్స్ బంద్ అంటూ వచ్చిన ప్రకటన వెనుక ఎవరున్నారో దర్యాప్తు చేయాలని ఆదేశించారు. దీంతో ఒక్కసారిగా అంతా ఉలిక్కిపడ్డారు. ఆ నలుగురు వల్లే అలా జరిగిందని ఆరోపిస్తున్నారు. అయితే ఆ నలుగురిలో తాను లేనని రీసెంట్‌గా నిర్మాత అల్లు అరవింద్ ప్రకటించిన విషయం తెలిసిందే. పవన్ మూవీ రిలీజ్ ముందే థియేటర్స్ మూస్తామని చెప్పడం దుస్సాహసంగా వర్ణించారు. తనకు ఉన్న థియేటర్స్.. తెలుగు రాష్ట్రాల్లో కేవలం 15 అని తెలిపారు. అవి కూడా డీల్ అయ్యాక రెన్యువల్ చేయొద్దని ఇప్పటికే తన స్టాఫ్‌కు చెప్పినట్లు వెల్లడించారు. ఇటీవల జరిగిన సంఘటనలతో తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. రీసెంట్‌గా జరిగిన మీటింగ్స్‌కు హాజరు కాలేదని క్లారిటీ ఇచ్చారు. కాగా, అల్లు అరవింద్ కామెంట్స్ సమంజసంగానే ఉన్నాయి. ఆ నలుగురిలో ఆయన లేరని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అదే సమయంలో దిల్ రాజు, సురేష్ బాబు, సునీల్ చుట్టూ వేళ్లు చూపిస్తున్నాయి. ఎందుకంటే వారి ముగ్గురికి తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక థియేటర్స్ ఉన్న విషయం తెలిసిందే. వారిది బిగ్ నెట్ వర్క్. దీంతో వారు ముగ్గురు ఇప్పుడు రెస్పాండ్ అవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీంతో తమ అభిప్రాయాలు వ్యక్తం చేయాలని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. వారిపై బిజినెస్‌పై ఎఫెక్ట్ పడకముందే స్పందించాలని, ఇప్పటికే లేట్ అయిందని అంటున్నారు. మరి దిల్ రాజు, సురేష్ బాబు సహా పలువురు ఎప్పుడు రెస్పాండ్ అవుతారో చూడాలి.

# వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా లెమన్ & టీ స్పూన్ ఆటల పోటీలు





**మైలవరం, (రాజధాని వార్తలు):** మైలవరం శాఖా గ్రంధాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థినీ, విద్యార్థులకు కథల పుస్తకాలు చదివించి కథల పుస్తకాలు చెప్పించడం జరిగినది. తదుపరి ఎం.రవి కుమార్ ఫిజికల్ డైరెక్టర్ జిల్లా పరిషత్ హై స్కూల్ మైలవరం విద్యార్థిని, విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ మరియు లెమన్ & టీ స్పూన్ ఆటల పోటీలు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి విద్యార్థిని, విద్యార్థులు పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# త్రాగునీటి కోసం విలవిలలాడుతున్న ఒకటో వార్డు ప్రజలు

## - పట్టించుకోని పంచాయతీ అధికారులు



**మైలవరం, (రాజధాని వార్తలు):** మైలవరం ఒకటో వార్డు నందు వాటర్ ట్యాంక్ నిర్మాణం గతంలో మూడు సంవత్సరాల నుంచి పంచాయతీ యందు ప్రపోజల్‌లో ఉంది కానీ నిర్మాణ పనులు మాత్రం జరగట్లేదు. మా ప్రాంతం ఒకటో వార్డు నందు భూగర్భ అంతయు ఉప్పునీరు ఉన్నది. ఎండాకాలం ప్రజలు త్రాగునీటి కోసం ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు కావున దయచేసి మాకు తాగునీటి వాటర్ ట్యాంక్ కట్టించవలసిందిగా మేమందరం ప్రార్థిస్తున్నాము. మైలవరం గ్రామపంచాయతీలో వాటర్ టెక్ నిమిత్తం మూడుసార్లు క్రితం తీర్మానం మరియు ఎస్టిమేషన్ వర్క్ ఆర్డర్ మరియు ముగ్గు కూడా పోసి ఉన్నారు ఆయన కూడా ఇంతవరకు ఎటువంటి ఫలితం లేదు. మాకు ఇక్కడ ప్రధానంగా మంచినీటి సమస్య ఉంది. కొంతమంది ఆక్రమణదారులు ప్రభుత్వం సంబంధించిన భూమిని దుర్వినియోగం చేయుటకు నిర్ణయించుకున్నారు వారికి కొంతమంది సహకరిస్తున్నారు కాబట్టి ఆ ప్రభుత్వ స్థలం దుర్వినియోగం అవకుండా మా అందరికీ ఉపయోగపడేలాగా వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని త్వరగా నిర్మించి ఒకటో వార్డు ప్రజల సమస్యను పరిష్కరించాలని కోరుకుంటున్నారు.

# అనకాపల్లి నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున కడప మహానాడు కార్యక్రమానికి తరలి వెళ్లిన టీడీపీ శ్రేణులు





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ & ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ పీలా గోవింద సత్యనారాయణ ఆధ్వర్యంలో రెండు బస్సులు, 30కారులలో బయలుదేరిన టీడీపీ శ్రేణులు....జెండా ఊపి బస్సును బయలుదేరించిన టీడీపీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, టీడీపీ నాయకులు.



# మహానాడుకి బయలుదేరిన ఉత్తర నియోజకవర్గం టిడిపి శ్రేణులు





**విశాఖ, (రాజధాని వార్తలు):** రేపు కడపలో జరగబోయే మహానాడుకి ఉత్తర నియోజకవర్గం నుండి ఉత్తర నియోజకవర్గం నాయకులు వెల్లంకి భరత్ ఆధ్వర్యంలో కార్యకర్తలతో ఎంపీ భరత్ కార్యాలయం నుండి సోమవారం బయలుదేరిన బస్సులుకి విశాఖ లోక్ సభ సభ్యులు ఎం శ్రీ భరత్ తెలుగుదేశం జెండా ఊపి ప్రారంభించారు ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ స్వర్గీయ ఎన్టీ రామారావు ప్రారంభించిన మహానాడు నేటికీ కూడా జరగటం ఆనందదాయకమని పేర్కొన్నారు. నాడు ఎన్టీ రామారావు ప్రారంభించిన మహానాడుని ఆదర్శంగా తీసుకుని నేడు చంద్రబాబు నాయుడు కొనసాగిస్తున్నారని అన్నారు.


# వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేయాలి

## - ఏఐటీయుసి రాష్ట్ర నేత కోన లక్ష్మణ డిమాండ్



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికి రేషన్ పంపిణీ చేసే వాహనాలు ఎం.డీ.యూ విధానాన్ని రద్దు చేయడం ద్వారా 20 వేల కుటుంబాలు రోడ్డున పడతాయని కాబట్టి ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కోన లక్ష్మణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తొలగించిన డ్రైవర్లు కొనసాగించి ఉపాధి కల్పించాలని ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టపరిచి వాహనాల ద్వారానే రేషన్ సరఫరా చేయాలని కోరుతూ సోమవారం అనకాపల్లి జిల్లా ఎండియు ఆపరేటర్స్ ఆధ్వర్యంలో అనకాపల్లి పట్టణం ఎన్టీఆర్ నుంచి బయలుదేరిన నిరసన ప్రదర్శన 4 రోడ్లు, చిన్న నాలుగు రోడ్లు, సుంకర మెట్ట జంక్షన్ మీదగా కలెక్టర్ ఆఫీస్ చేరి అక్కడ నిరసన తెలిపి జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కోన లక్ష్మణ, సంఘం అధ్యక్షులు, జెట్టి శ్రీను, ప్రధాన కార్యదర్శిబంగారు లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతం చేయాలి అనే ఉద్దేశం ఉంటే, కేరళ రాష్ట్రం వలె పేద ప్రజలకు 16 రకాల నిత్యవసర సరుకులను పంపిణీ చేయొచ్చు అన్నారు. అంతేగాని గత ప్రభుత్వంలో నియమించారు కాబట్టి వారిని తొలగించాలని కక్ష సాధింపు చర్యలు కరెక్ట్ కాదని హితవు పలికారు. గత ప్రభుత్వం రేషన్ డీలర్లను కొనసాగిస్తూనే ఎం.డి.యు విధానాన్ని అమలు చేసిందని గుర్తు చేశారు. కాబట్టి అదే విధంగా ఇప్పుడు రేషన్ డీలర్లతో పాటు ఎం డి యు విధానం కూడా అమలు చేయవచ్చునని అన్నారు. ప్రభుత్వం అకస్మాత్తుగా ఇంటింటి రేషన్ పంపిణీ విధానం రద్దు చేయడం వలన ఎం.డి.యులు వందల మంది హెల్పర్లు సుమారు 20 వేల మంది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2027 వరకు రాష్ట్ర ప్రభుత్వంతో వీరికి అగ్రిమెంట్ ఉన్నదని గుర్తు చేశారు ఇప్పటికీ వాహనాలపై వీరు ఈఎంఐలు కడుతున్నారని మంత్రి నాదెండ్ల మనోహర్ ఉచితంగా వీటిని అందజేస్తున్నామని గొప్పలు చెబుతున్నారు 10% డౌన్ పేమెంట్‌గా 62000/ వేల రూపాయలు కట్టారు వీరికి ఇస్తున్నటువంటి 21000/ వేల జీవితంలో ఎండియు ఆపరేటర్లకు 10,000/ హెల్పర్లు 5000/ పెట్రోల్ ఖర్చులు 3000/ పోగా మిగిలిన 3000/ రూపాయలను 30% సబ్సిడీ కింద ఏండియు ఆపరేటర్లు చెల్లిస్తున్నారు కానీ ఈ ప్రభుత్వం ఉచితంగా వాహనాలను ఇచేస్తున్నామని గొప్పలు చెప్తోంది ఏ విధంగా ఉచితంగా ఇచ్చారు అని ప్రశ్నించారు. రేషన్ పంపిణీ విధానములో ఏమైనా లోపాలు ఉంటే వాటిని సరిదిద్ది ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాల్సిన ప్రభుత్వం "ఇంట్లో ఎలుకలు ఉన్నాయని ఇంటిని తగలబెట్టిన చందంగా" ప్రజలకు దగ్గరగా పంపిణీ జరుగుతున్న ఎండియు వ్యవస్థను రద్దు చేయడం ప్రభుత్వ అనాలోచిత నిర్ణయానికి నిదర్శనమని, రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఎం.డి.యులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎం డి యు ఆపరేటర్స్ కొవ్వూరు ప్రసాద్, కాళీ తారకేశ్, వజ్రపు వేణు, ఏఐటీయూసీ నాయకులు వాయిబోయిన శేఖర్, కోరిబిల్లి జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

# కళాసిలు సమస్యలు పరిష్కారం చేయాలి : ఏఐటీయూసీ నేత కోన







**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** సిడబ్ల్యూసి గోడౌన్లలో పనిచేస్తున్న కళాసీలకు అందరికి పని కల్పించాలి వారి కుటుంబాలను ఆదుకోవాలని అనకాపల్లి సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ కళాసీలు సంఘం (ఏఐటీయూసీ) గౌరవ అధ్యక్షులు కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సిడబ్ల్యూసి కళాసీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ మీద ఆధారపడి సుమారు 30 సంవత్సరములు నుండి 60 మంది కళాసీలు పని చేసుకుంటూ జీవనం సాగించుతున్నారు అని, అయితే గోడన్లు గత 5 సంవత్సరాలుగా 60 మంది కళాసీలుకు తగ్గ పనిలేదు ఇక్కడ పదిమందికి మాత్రమే పని దొరికింది మిగతా 50 మంది కళాసీలు ఖాళీగా ఉన్నారు దాని వలన వారి కుటుంబాలు ఆకలి కేకలతో రోడ్డున పడుతూ అప్పులు చేసుకుంటూ వడ్డీలు కట్టలేక జీవనం సాగిస్తున్నాము ప్రభుత్వ అధికారులు పాత పద్ధతిలో రేషన్ తోలకం (కోటా రైస్) ను పూర్తిస్థాయిలో వినియోగం తీసుకొని వచ్చి మా కళాసీలు చేతినిండా పని కల్పించి వారి కుటుంబాలను ఆదుకోవాలని, అలాగే సిడబ్ల్యూసి కళాసీలు అందరికీ ప్రభుత్వ తరపున నుండి ఐడి కార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షులు బోండా నూకరాజు, కార్యదర్శి ఏడు ఆకుల రమణ, ఉపాధ్యక్షులు జద్యం అప్పారావు, సహాయ కార్యదర్శి సీ హెచ్. వీర అప్పారావు, నాయకులు, స్వరూప్ అప్పల కొండ, అప్పారావు, సోము నాయుడు, శ్రీను, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డున పడనున్న 20 వేల కుటుంబాలు



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికి రేషన్ పంపిణీ చేసే వాహనాలు ఎం.డీ.యూ విధానాన్ని రద్దు చేయడం ద్వారా 20 వేల కుటుంబాలు రోడ్డున పడతాయని కాబట్టి ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కోన లక్ష్మణ ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతం చేయాలి అనే ఉద్దేశం ఉంటే, కేరళ రాష్ట్రం వలె పేద ప్రజలకు 16 రకాల నిత్యవసర సరుకులను పంపిణీ చేయొచ్చు అన్నారు. అంతేగాని గత ప్రభుత్వంలో నియమించారు కాబట్టి వారిని తొలగించాలని కక్ష సాధింపు చర్యలు కరెక్ట్ కాదని హితవు పలికారు. గత ప్రభుత్వం రేషన్ డీలర్లను కొనసాగిస్తూనే ఎం.డి.యు విధానాన్ని అమలు చేసిందని గుర్తు చేశారు. కాబట్టి అదే విధంగా ఇప్పుడు రేషన్ డీలర్లతో పాటు ఎండియు విధానం కూడా అమలు చేయవచ్చునని అన్నారు. ప్రభుత్వం అకస్మాత్తుగా ఇంటింటి రేషన్ పంపిణీ విధానం రద్దు చేయడం వలన ఎం.డి.యులు వందల మంది హెల్పర్లు సుమారు 20 వేల మంది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2027 వరకు రాష్ట్ర ప్రభుత్వంతో వీరికి అగ్రిమెంట్ ఉన్నదని గుర్తు చేశారు ఇప్పటికీ వాహనాలపై వీరు ఈఎంఐలు కడుతున్నారని, ఈఎంఐలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఎం.డి.యులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని అన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan